క్లుప్తంగా

17, 18 తేదీల్లో రాయదుర్గం డివిజన్ ఇస్తెమా



మొలకాల్మూరులోని ఇస్తెమా స్థలంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న జమాత్ సభ్యులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం డివిజన్ ఇస్తెమా (ఇస్లామిక్ సమ్మేళనం) ఈ నెల 17, 18 తేదీల్లో సరిహద్దు కర్ణాటకలోని మొలకాల్మూరులో జరనుంది. ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. మొలకాల్మూరులోని హానగల్‌కు వెళ్లేదారిలో మదరసా పక్కన 25 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం ఏర్పాట్లను రాయదుర్గం డివిజన్ జమాత్ పెద్దలు, సభ్యులు పరిశీలించారు. రాయదుర్గం డివిజన్ పరిధిలోకి మొలకాల్మూరు, కణేకల్లు, కంబదూరు, కళ్యాణదుర్గం, వైఎస్ఎస్ కోట ప్రాంతాలు వస్తాయి. ప్రధాన పెండాల్, పార్కింగ్, భోజన వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాట్లను పర్యవేక్షించారు. మౌలానా మునీర్‌సాబ్ ప్రత్యేక దువా పఠించి ఇస్తెమా విజయవంతం కావాలని కోరారు.

పరీక్షలంటే భయాన్ని వీడాలి

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు స్వామి బాలచంద్ర



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు స్వామి బాలచంద్ర

ఉరవకొండ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థులు భయాన్ని వీడాలని హైదరాబాద్ అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు స్వామి బాలచంద్ర సూచించారు. మంగళవారం స్థానిక ఉరగాద్రి కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు గమ్యం పేరుతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఉరవకొండ నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకట్ తాడికొండ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సమావేశంలో పదో తరగతి పరీక్షలపై విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో మోటివేషన్ చేశారు. అనంతరం ఉరవకొండ వైద్యాధికారిణి కొత్త సాక్షి మాట్లాడుతూ పరీక్ష హాల్‌లో విద్యార్థులు మనసు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్ష రాసేందుకు వెళ్లే సమయంలో లైట్ ఫుడ్ తీసుకోవాలన్నారు.

15 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉరవకొండ: చిన్నముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూ, రాత పరీక్షల్లో ప్రతిభ చూపి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో చెన్నైకు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అకాడమీ ఫర్ టెక్నికల్ స్కిల్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు 50 మందికి రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో 15 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కంపెనీ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ అష్రాఫ్ ఆలీ, సీనియర్ అధ్యాపకులు సురేష్‌బాబు, నరసింహారెడ్డి, సులోచన పాల్గొన్నారు.

14న చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం

కూడేరు: జల్లిపల్లిలో ఈ నెల 14న సంక్రాంతిని పురస్కరించుకొని చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం నిరసన



రాయదుర్గంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రాయదుర్గంటౌన్: ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిన ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనను ప్రతి పౌరుడూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వినాయక సర్కిల్‌లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలియజేశారు. ఈనెల 8న ప్రధాని రాష్ట్ర పర్యటను నిరసిస్తూ 'రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన మోదీ గో బ్యాక్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రానికి బీజేపీ, మోదీ చేసిన ద్రోహం, మోసాన్ని ప్రజలు మర్చిపోకూడదన్నారు. విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమను నిర్మించి, ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఏపీకి తీరని ద్రోహం చేసిన మోదీని కూటమి ప్రభుత్వం ఆహ్వానించడం ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమే అని అన్నారు. కార్యక్రమంలో మధు, తిమ్మరాజు, అంజి, నగేష్, సురేష్, వంశీ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

- బొమ్మనహాళ్ మండలం చంద్రగిరిలో గతేడాది నవంబర్ 17న భూవివాదంతో బీజేపీ నాయకుడు కృష్ణమూర్తిశెట్టిని టీడీపీ నాయకుడు శ్రీరాములు ఇంట్లోకి దూరి నరికి చంపాడు. నిందితుడిని పోలీసులు జైలుకు పంపారు.
- డిసెంబర్ 12న దాయాదుల మధ్య తలెత్తిన భూ వివాదంలో చదం గ్రామానికి చెందిన గంగాధర అనే యువకుడిపై దాడి జరిగింది. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు.. ముగ్గురు నిందితులను జైలుకు పంపారు.
- గుమ్మఘట్ట మండలం ఎర్రంపల్లిలో రస్తా విషయంపై వివాదం తలెత్తింది. ఓ వర్గం వారు దౌర్జన్యం,దాడులకు తెగబడుతుండడంతో మరో వర్గం వారు న్యాయం చేయాలని అధికారులను ఆశ్రయించారు.
- డీ హీరేహాళ్ మండలం మురడిలో తనకు దక్కాల్సిన పొలం మరొకరి పేరుపై ఉందని పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారంటూ ఓ అడ్వొకేట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలా ఈ నాలుగు చోట్లే కాదు.. ఊరూరా భూ సమస్యలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లోనూ అధికంగా వినతులు భూ తగాదాలపైనే రావడం విశేషం.



భూవివాదం .. బలి తీస్తోంది!

- పెరుగుతున్న హత్యలు, దాడులు
- రెవెన్యూ సదస్సుల్లోనూ వాటిపైనే అధికంగా అర్జీలు
- బొమ్మనహాళ్‌లో భూ తగాదాతోనే బీజేపీ నాయకుడి దారుణ హత్య
- చదంలో దాయాదుల చేతిలో హత్యకు గురైన సోదరుడు
- రీ సర్వే చేసి ఉంటే ఈ సమస్యలుండేవి కాదంటున్న ప్రజలు



భూవివాదంలో హత్యకు గురైన బీజేపీ నేత కృష్ణమూర్తిశెట్టి



దాయాదుల చేతిలో హత్యకు గురైన గంగాధర

రాయదుర్గం: భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ.. వాటికి తగ్గట్టుగానే వివాదాలు కూడా ఎక్కువగానే జరుగుతున్నాయి. తరాలు మారినా..అధికారులు మారుతున్నా భూ సమస్యలు తీరడం లేదు. భూ తగాదాలు కాస్త గొడవలు, హత్యలు వరకూ దారి తీస్తున్నాయి. సమస్య చిన్నదే అయినా క్షణికావేశంలో కొందరు హత్యకు గురవుతున్నారు. పోలీస్ కేసుల్లోనూ భూ వివాదాల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. సర్దుబాటుతో కొన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తున్నా, వివిధ కారణాలతో మరికొన్ని అపరిష్కృతంగా మిగులుతున్నాయి. దీంతో హత్యలు, దాడులు, దౌర్జన్యాలతో కొందరు బలైపోగా, ఇంకొందరు ఆస్పత్రుల పాలవుతున్నారు. రాయదుర్గం,కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ప్రతి నెలా పదుల సంఖ్యలో వీటిపై ఫిర్యాదులు అందుతున్నాయి. రెవెన్యూ అధికారులు వీటి సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉన్నా కొన్నిచోట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రీ సర్వేతో భూ వివాదాలకు చెక్

రైతుల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాంకేతికంగా, శాస్త్రీయ పద్ధతిలో రీసర్వే విధానాన్ని అప్పట్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలులోకి తీసుకొచ్చారు. డ్రోన్ల ద్వారా హద్దులు గుర్తించి సెంటు కూడా వ్యత్యాసం లేకుండా సర్వే రాళ్లు పాతించారు. ఈ విధానం ద్వారా ఎక్కడి సమస్యకు అక్కడే పరిష్కార మార్గం లభించింది. దశల వారీగా అన్ని గ్రామాల్లోనూ ఈ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. కాగా అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఈ విధానంపై వ్యతిరేకత తీసుకొచ్చి, సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయేలా దుష్ప్రచారం చేశారు. ప్రజల మనసు మార్చేందుకు ప్రయత్నించారు. ఫలితంగా వివాదాలు రైతుల మధ్యనే వదిలేశారు. మళ్లీ రీ-సర్వే చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడడంపై రైతులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.

వివాదాలకు కారణాలు ఇవీ...

- భూ సమస్యలు చాలా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్నాయి.
- గతంలో అమ్మిన భూములు, ఆన్‌లైన్‌లో అలాగే ఉండిపోవడంతో వివాదాలకు కారణమవుతోంది.
- చాలా గ్రామాల్లో సర్వే నంబరు ఒకటి ఉండగా, క్షేత్రస్థాయిలో మరో రైతు ఉన్నారు.
- వారసత్వం వచ్చే భూ పంపకాల్లో హెచ్చు తగ్గులు, తదితర కారణాలతో గొడవలు జరుగుతున్నాయి.
- గతంలో పట్టా కాకముందు అమ్మిన భూములను అనంతరం ధరలు పెరిగాక పట్టా చేసుకుని అమ్మినవారి నుంచి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తుండడం వివాదంగా మారుతోంది.
- ఇష్టారాజ్యంగా మ్యుటేషన్లు చేస్తుండడంతో సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి.
- చిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని ఘర్షణలకు పాల్పడుతూ జైలు పాలవుతున్నారు. ప్రాణాలు కోల్పోతున్నారు. ఆర్థికంగా నష్టపోతున్నారు. సామరస్యంగా పరిష్కరించుకుంటే అందరికీ మేలు జరుగుతుంది.

ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతాం



రాజీమార్గమే రాజమార్గం అన్న విషయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. సామరస్యంగా పరిష్కారమైతే భూ సమస్యలుండవు. ఒకరి మధ్య ఒకరు గట్టుకోసం గొడవులు పడడం, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టుకోవడం సరైన పద్ధతి కాదు. సమస్య ఎలాంటిదైనా సరే పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ సిద్ధంగా ఉంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదు. భూ సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కరించాలని ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా అన్ని రకాల భూ సమస్యలు సుమారు 1,475 వచ్చాయి. వాటిలో 375 పరిష్కరించాం. మిగిలినవి వివిధ దశల్లో ఒప్పించి పరిష్కరించాల్సి ఉంది.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

రెవెన్యూ సదస్సు అర్జీలకు 'మోక్షం' లభించేనా..?



కూడేరు మండలం కలగళ్ల సభలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

కూడేరు: మండలంలో కూటమి ప్రభుత్వం భూ, ఇతర సమస్యలకు పరిష్కారం మార్గం చూపాలన్న ఉద్దేశంతో రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. డిసెంబర్ 10న ఉదిరిపికొండలో అధికారులు రెవెన్యూ సదస్సు ప్రారంభించారు. తొలి రోజే ప్రజలు, రైతుల నుంచి రెవెన్యూ సదస్సులపై వ్యతిరేకత వచ్చింది. అధికారులను ఎన్నిసార్లు అర్జీలిచ్చినా పరిష్కారం కానందుకు సదస్సులు ఎందుకు అని నిలదీశారు. ఇలా ప్రతి గ్రామంలోనూ నిలదీతలు, ప్రశ్నించడాలతోనే జనవరి 4న చోళ సముద్రంలో రెవెన్యూ సదస్సులు ముగిశాయి. అయితే రెవెన్యూ సదస్సుల్లో వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 500 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అందులో 200 వరకు సాగులో ఉన్న అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని అర్జీలు వచ్చాయి. మరో వంద వరకు రస్తా సమస్యలపైనా వచ్చాయి. మిగిలినవి వివిధ సమస్యలపై అర్జీలు వచ్చాయి. అధికారులు అర్జీలకు పరిష్కారం చూపేరా? అని రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పరిష్కారానికి చర్యలు



రెవెన్యూ సదస్సుల్లో 500 అర్జీలు వచ్చాయి. వాటిని త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాం. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నిబంధనల మేరకు పరిష్కారం చూపాలని సిబ్బందిని ఆదేశించాం. పరిష్కారం కాని సమస్యలకు ఎందుచేత పరిష్కరించలేమో కూడా అర్జీదారులకు తెలియజేస్తాం. సాధ్యమైనంత వరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మహబూబ్ బాషా, ఇన్‌చార్జ్ తహసీల్దార్, కూడేరు మండలం

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోండి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించని కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణీ, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఏఓ ప్రవీణ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ పట్టణ అభివృద్ధికి సహకరించకపోగా, జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీతో పాటు ప్రతి పనికీ ఒక రేటు ఫిక్స్ చేసి, అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఆరు నెలల నుంచి కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండానే బయట వ్యక్తులకు కార్యాలయంలోని పనులు, బాధ్యతలను అప్పగించారన్నారు. కళ్యాణదుర్గంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ ద్వేషాలను పెంచుతూ కొత్త ఒరవడికి తెరతీస్తున్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు, పడకేసిన పారిశుధ్యంపై చర్చించేందుకు రావాలని మున్సిపల్ చైర్మన్ కోరగా, ఇందుకు ఆయన నిరాకరించారని, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉన్న చోటకు తాను రానని ఖరాకండిగా చెప్పారన్నారు. ఉన్నతాధికారులు కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, పట్టణ అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు పరమేశ్వరప్ప, రాము, లక్ష్మన్న, కోఆప్షన్ సభ్యుడు అబ్బల్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిబాబు

బొమ్మనహాళ్: ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు హెచ్చరించారు. మంగళవారం బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ భవనం, పరిసరాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. వాటి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్ఐ నబీరసూల్‌ను ఆదేశించారు. సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ రవిబాబు మట్కా, పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో గస్తీ పెంచుతామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నబీరసూల్, ఏఎస్ఐ హనుమంతరెడ్డి, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారికిరువైపులా మున్సిపల్, పోలీసుల శాఖ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కొనసాగుతోంది. వ్యాపారులు తమ ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించకుంటున్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, సీఐ జయానాయక్, టీపీఎస్ మురళీమోహన్ ఆక్రమణలను పర్యవేక్షించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు వెంబడి తొలగించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

రాయదుర్గంటౌన్: పట్టణంలో మున్సిపల్ కమిషనర్ మంగళవారం పర్యటించారు. రాణిఛత్రంలోని అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేసి, నాణ్యతపై నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం 9వ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను, డ్యూటీ చార్ట్‌ను పరిశీలించారు. అనంతరం కణేకల్లు రోడ్డులోని వైఎస్సార్ పార్కును పరిశీలించి, సౌకర్యాల కల్పనకు ఏఈ వీరేష్‌కు సూచనలు చేశారు.

రీసర్వేకు సహకరించాలి

గుమ్మఘట్ట: రైతులందరూ రీ సర్వేకు పట్టాదారు పాసు పుస్తకాలు, అందుకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకొని సహకరించాలని డీటీ రఘు కోరారు. మంగళవారం గోనబావిలో రీసర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20 నుంచి రీసర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, సర్వేయర్ సుకర్ణయాదవ్, సర్పంచ్ రాజేష్ పాల్గొన్నారు.



జీడిపల్లి పెద్దమాంబ అమ్మవారికి దేవరలో సమర్పించిన బోనాలు

జీడిపల్లిలో పెద్దమాంబ గ్రామ దేవర

బెళుగుప్ప: జీడిపల్లిలో మంగళవారం జరిగిన గ్రామ దేవత పెద్దమాంబ అమ్మవారి దేవరకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తొమ్మిదేళ్ల తర్వాత గ్రామ దేవర నిర్వహించడంతో జనం వేల సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలోని అమ్మవారికి బోనాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు పూజలను నిర్వహిస్తే పాడిపంటలు, గ్రామశాంతి ఆయురారోగ్యాలతో గ్రామం సుభిక్షంగా ఉంటుందని గ్రామస్తుల నమ్మకం. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో సీఐ చిన్న గౌస్, ఎస్ఐ శివ, ప్రత్యేక పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చదువులోనూ విజేతలుగా నిలవాలి

ఉరవకొండ: విద్యార్థిని, విద్యార్థులు క్రీడారంగంతో పాటు చదువులోనూ విజేతలుగా నిలవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వివిధ క్రీడల్లో విజేతలకు ఎస్ఎఫ్ఐ నాయకులు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్ఎం రాజేశ్వరితో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు ఖోఖో పోటీలు ప్రారంభించారు. విజేతలకు హెచ్ఎంతో పాటు సీనియర్ పీడీ మారుతీప్రసాద్ చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరూన్‌రషీద్, నందు, శివ, వంశీ, రాజేష్, సురేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను సమష్టిగా కట్టడి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫణికుమార్

కణేకల్లు: బాల్య వివాహాలను సమష్టిగా కట్టడి చేద్దామని తహసీల్దార్ ఫణికుమార్ పేర్కొన్నారు. మంగళవారం కణేకల్లుక్రాస్‌లోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ గ్రామస్థాయి కిశోరి వికాసం బృందం సభ్యులనుద్దేశించి మాట్లాడారు. బాలిక విద్య ఆవశ్యకత, బాలికల భవిష్యత్తుపై గ్రామీణ ప్రాంత ప్రజల్లో సరైన అవగాహన లేక పోవడంతో మైనర్ బాలికలకు పెళ్లిళ్లు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బృందంలో ఉండే ఏఎన్ఎం, జీఎంఎస్‌కే (మహిళ సంరక్షణ కార్యదర్శి), వెల్ఫేర్‌అసిస్టెంట్, అంగన్‌వాడీ వర్కర్, స్కూల్ టీచర్‌లు మైనర్ బాలికల పెళ్లిళ్ల నియంత్రణతోపాటు బాలిక విద్యపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు బాధ్యతగా చేపట్టాలన్నారు. మైనర్ బాలికలకు పెళ్లిళ్లు చేస్తే కలిగే అనర్థాలను తల్లీదండ్రులకు వివరించాలన్నారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ గ్రామస్థాయి కిశోరి వికాస బృందం సభ్యులు గ్రామ స్థాయిలో నెలకు రెండు సార్లు అవగాహన సభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఎస్ఐ శంకర్‌రెడ్డి, డాక్టర్లు నిరీషా, విజయ్‌కుమార్, ఎంఈఈఓలు లక్ష్మణ్ణ, భవానీ శంకర్, ఏపీఎం ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

పాత్రికేయుడు దేవప్రసాద్ మృతి తీరనిలోటు

ఉరవకొండ: సీనియర్ పాత్రికేయుడు, తొలితరం మీడియా జర్నలిస్టు నందినేని దేవప్రసాద్ మృతి తీరని లోటు అని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టు దేవ ప్రసాద్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాదాపు 30 ఏళ్లుగా ప్రాతికేయుడిగా పనిచేశారని, తుది శ్వాస వరకూ మంచితనంతో మెలిగారన్నారు. దేవ ప్రసాద్ మృతికి మాజీ డీసీఎంఎస్ చైర్మన్ జయచంద్రనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల నాగేశ్వరావు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రమణ యాదవ్, సర్పంచులు తదితరులు మాట్లాడారు.

పశువుల గర్భకోశ చికిత్స శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో పశువులకు గర్భకోశ చికిత్స శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యనిర్వాహక అధికారి టీవీ సుధాకర్ మాట్లాడారు. కేవీకే పశువైద్యులు హరిణి, పశువైద్యులు పాల్గొన్నారు.

గొర్రెలకు ఉచితంగా మందుల పంపిణీ

బెళుగుప్ప: నరసాపురంలోని 12 మంది గొర్రెల కాపరులకు చెందిన 60 చూడు గొర్రెల పోషణకు మంగళవారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో గొర్రెలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విర్‌బాక్ కంపెనీ ప్రతినిధులు ఆర్‌ఎం ఓం ప్రకాశ్, ఏరియా మేనేజర్ రవికుమార్, తిరుపాలురెడ్డి, పశుసంవర్ధక సహాయకులు విజయ్, రవినాయక్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు చెన్నకేశవులు మృతి

ఉరవకొండ: స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకుడు చెన్నకేశవులు (59) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. దండోరా ఉద్యమం ప్రారంభం నుంచి పనిచేస్తున్నాడు. మాదిగల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నాడు. గ్రామీణ ప్రాంతాల్లో హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, ఆలయాల్లో ప్రవేశంపైనా ఆందోళనలు చేశాడు. చెన్నకేశవులు మృతదేహం వద్ద దండోరా రాష్ట్ర నాయకులు అక్కులప్ప, రాజు, రామాంజనేయులు తదితరులు నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

నేడు అద్దె రూముల వేలం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ పైఅంతస్తులోని రూములను అద్దె ప్రాతిపదికన కేటాయింపునకు ఈనెల 8న 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఏ బ్లాక్‌లో 15 రూములు, బీ బ్లాక్‌లో 25 రూములను రూ.1.50 లక్షల మేర గుడ్‌విల్ (నాన్ రీఫండబుల్) ప్రాతిపదికన నెలకు రూ.3,300 అద్దె ప్రకారం వేలం పాట జరుగుతుందన్నారు.

పుస్తకాల కోసం విద్యార్థుల ఘర్షణ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, వివేకానంద ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు పుస్తకాల కోసం మంగళవారం ఘర్షణ పడ్డారు. ఘర్షణలో వర్ధన్ అనే విద్యార్థి గాయపడ్డాడు. పోలీసులు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ పోరాటం

కూడేరు: ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తూ, పరిష్కారానికి కృషి చేస్తుందని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సీతారామరావు , సెక్రెటరీ అడవి రాజు తెలిపారు. మంగళవారం కూడేరులోని ఎమ్మార్సీలో నూతన సంవత్సరం-2025 ఏపీటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓ -2 సాయి కృష్ణ ఆవిష్కరించారు. కరుట్లపల్లి హైస్కూల్ హెచ్‌ఎం ఆంజనేయులు, ఏపీటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొర్రెల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

బెళుగుప్ప: హనిమరెడ్డిపల్లి గ్రామంలో పశు సంవర్ధక అధికారులు మంగళవారం నిర్వహించిన ప్రాథమిక గొర్రెల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గ్రామంలోని గొర్రెల పోషకులు కలసి ఎన్నికల అధికారి మంజునాథ్ పర్యవేక్షణలో కార్య నిర్వహణ అధికారులు రమేష్, నవీన్‌కుమార్‌లతో కలసి ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలోనే హనిమరెడ్డిపల్లి ప్రాథమిక గొర్రెల సహకార సంఘం అధ్యక్షులుగా తిప్పన్న, ఉపాధ్యక్షులుగా శ్రీరాములుతో పాటు కురుబ గోపాల్, బోయ ఎర్రిస్వామి, చిన్న ఎర్రిస్వామి, కె.ఎర్రిస్వామి, మాల పెద్దన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు.

పాడి పశువుల కోసం దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేస్తోన్న ఉచిత పశువుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సంఘం సీఈఓ నరసింహమూర్తి, డైరెక్టర్ లక్ష్మీపతి తదితరులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండో విడత కింద 60 మంది రైతులకు పశువులు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, సేంద్రియ ఎరువులను తయారు చేసుకునేవారు అర్హులన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

వజ్రకరూరు: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని గడేహోతూరులో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నయాజ్ అహమ్మద్, అధికారులు హాజరయ్యారు. గ్రామస్తులు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ కోసం భూములు ఇచ్చామని, అయినా ఆన్‌లైన్‌లో అలానే చూపుతోందని అధికారుల దృష్టికి తెచ్చారు. మొత్తం 14 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.మండల సర్వేయర్ మంజుల, ఆర్ఐ అశ్వర్థనారాయణ, వీఆర్వో ఈశ్వర్, గ్రామకార్యదర్శి సుభాన్‌జీ, ఎండోమెంట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కుందుర్పి: మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ సూచించారు. మంగళవారం మండలంలోని అపిలేపల్లిలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు-శిక్షణా కార్యక్రమం, అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త హాజరయ్యారు. ఆయన మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులు, తెగుళ్ల నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ అధికారిణి గౌసియా, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.